

గుండెపోటుతో టిడిపి నాయకుడు పడాల మృతి



ప్రజాశక్తి - బిక్కవోలు


టిడిపి సీనియర్ నాయకుడు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పడాల ఆదినారాయణరెడ్డి(బుజ్జి) గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, పార్టీకి క్రమశిక్షణతో సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, అనపర్తి మాజీ ఎంఎల్‌ఎ నల్లమల్లి రామకృష్ణారెడ్డి పడాల భౌతికకాయాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిది అన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కౌలురైతుల కష్టాలు తీరేనా..

- అత్యధిక సాగుదారులున్నా ఆదరణ కరువు
- అందని ద్రాక్షలా ప్రభుత్వ పథకాలు, రుణాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా కౌలు రైతుల కష్టాలు మాత్రం తీరట్లేదు. ఏటా ఏదే పరిస్థితి తలెత్తుతోంది. వ్యవసాయ భూమి కలిగిన రైతులు మాత్రమే ప్రభుత్వ దృష్టిలో అన్నదాతలుగా పరిగణింపబడటమే ఈ దుస్థితికి కారణం. సొంత భూమి ఉన్న రైతులే పంటలు చేతికి రాక, వచ్చిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కౌలు రైతులకు రుణాలు ఇప్పించి ఆదుకుంటామని ప్రభుత్వం చెప్తుడమే కాని ఆచరణలో లేదు. భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా సాగుదారులుగా గుర్తింపు లేకపోవడంతో కౌలుదారులు రైతుగా పొందాల్సిన పథకాలకు దూరమవుతున్నారు. కౌలు ఒప్పందాలన్నీ నేటికీ నోటి మాట మీదే జరుగుతున్నాయి. కౌలు రైతులు భూమి సాగుచేస్తున్నా పంట రుణాలు, రైతు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారం-ఇలా రైతులకు అందే ఏ సాయం వారికి అందడం లేదు. కౌలుదారు కార్డు ఉంటేనే ఉంటేనే అవి దక్కుతాయి. నకిలీ విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేకపోవడం తదితర కారణాలతో కౌలు రైతులు నష్టపోతున్నారు. సొంత భూమి కలిగి సేద్యం చేస్తున్న వారికయ్యే సగటు ఖర్చులతో పోల్చితే కౌలుదారులకు రెట్టింపు పెట్టుబడి అవుతుంది.



తూర్పుగోదావరి జిల్లాలో ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాలకు పైగా సాగు జరుగుతోంది. సుమారు లక్షకుపైగా కౌలు రైతులు ఉన్నారని అంచనా. కౌలు రైతులు గ్రామాల్లో రెండు రకాలుగా ఉన్నారు. పూర్తిస్థాయిలో భూమి లేనివారు ఇతర వ్యక్తుల నుంచి భూమి తీసుకుని సాగు చేస్తున్నారు. అత్యధిక మంది భూయజమాని నుంచి కౌలునామా పత్రం సైతం రాసుకుని వ్యవసాయం చేస్తున్నారు. అలాగే వ్యవసాయాన్నే మాత్రమే నమ్ముకుని ఉండే రైతులు తమకున్న ఎకరం, రెండెకరాలతో పాటు తమ సామర్థ్యానికి అనుగుణంగా తమ పక్కన ఉన్న భూములనో, లేదా ఇతర చోట్ల ఉన్న భూములనో కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇలాంటి చిన్నసన్నకారు రైతులు కౌలుకు తీసుకుని చేసే పద్ధతి జిల్లాలో ఎక్కువ శాతంలో ఉంటుంది.

జిల్లాలో కౌలు ధరలు పైపైకి

ఎకర భూమికి రైతులు చెల్లించే కౌలు రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. నీరు సంవృద్ధిగా ఉండి, అనుకూలమైన విధంగా భూమి ఉంటే కౌలు అధిక మొత్తంలో చెల్లించక తప్పటంలేదు. కొంతమంది రైతులు మాత్రమే కౌలునామా రాసుకుంటుండగా మరికొంత మంది నోటి మాటతోనే కౌలుకు చేస్తున్నారు. అయితే కొంత మంది భూయజమానులు నగదు కాకుండా పండిన పంటలో ఎకరానికి 6 నుంచి 14 బస్తాల చొప్పున తీసుకుంటున్నారు. ఎకరం వరిపంట సాగుకయ్యేందుకు కావాల్సిన మొత్తం ఖర్చు సుమారుగా రూ.36 వేలు. ఇవికాక, మార్కెట్‌కు వెళ్లిన తర్వాత హమాలీ ఛార్జీలు, వర్షం కురిస్తే పరదాల కిరాయిలు, వర్షానికి తడిసి నీటిపాలయ్యే ధాన్యం ఇవేమీ యజమానికి సంబంధం లేదు. ప్రభుత్వ మాత్రం వరికి మద్దతు ధర రూ.2,040 మాత్రమే ఇస్తుంది. దీంతో గిట్టుబాటు కాక కౌలు రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

గుర్తింపు కార్డులకు సవాలక్ష నిబంధనలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ యజమానుల నుంచి కౌలునామా పత్రాలు రాసిచ్చి అంగీకారం తెలిపితే గుర్తింపు (సిసిఆర్‌సి) కార్డులు ఇస్తున్నారు. అయితే కొంతమంది రైతులు నిరాకరించడంతో కౌలునామా పత్రాలు కనుమరుగయ్యాయి. నిబంధనల ప్రకారం కౌలు రైతులను గుర్తించి, వారికి రుణ అర్హత కార్డులు అందిస్తే, బ్యాంకు రుణాలు కూడా ఇవ్వాలి. కానీ, వీరిపై రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎలాంటి దయ చూపడం లేదు. దీంతో ఎలాంటి సహకారానికి నోచుకోవడం లేదు కనీసం బ్యాంకు నుంచి రుణాలు పొందలేని స్థితిలో కౌలు రైతులున్నారు.

అర్హులందరికీ గుర్తింపు కార్డులు

జిల్లాలో అర్హులైన కౌలు రైతులు అందరినీ గుర్తించి సిసిఆర్‌కార్డులు అందిస్తున్నాం. గతేడాది అందజేసిన అర్హులందరి కార్డులనూ ఈ ఏడాది రెన్యువల్స్ చేస్తున్నాం. 14వ తేదీ నాటికి 11,771 మంది కౌలుదారు కార్డులను రెన్యువల్ చేశాం. జిల్లాలో ఈ ఏడాది రెన్యువల్స్, నూతనంగా మంజూరు కలిపి 70,905 లక్ష్యంగా తీసుకున్నాం. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారు భూ యజమానులను, కౌలు రైతులను సమావేశ పరిచి అవగాహనన కల్పించి అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు.

- ఎస్.మాధవరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

పాఠ్య పుస్తకాలు అందించాలని ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విటి జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాం బాబు, ఎన్.రాజా మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వమే పాఠ్య పుస్తకాలను అందించాలన్నారు. ఈ ఏడాది పాఠ్యపుస్తకాలను ఇవ్వట్లేదని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన ద్వారా తెలిపారన్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు ఒక సర్క్యులర్‌ను విడుదల చేసిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వలేని ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎలా కృషి చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని మార్చు కోవాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు జోసెఫ్, ఎస్‌ఎఫ్‌ఐ విటి కాలేజ్ నాయకులు రాజేష్, దేవి, భాష తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి - చాగల్లు

ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ డిమాండ్ చేశారు. ఆశాలపై రాజకీయ, అధికారుల వేధింపులు అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 18న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల ధర్నాలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోశమ్మ మాట్లాడారు. రూ.10వేల గౌరవ వేతనం పేరుతో ప్రభుత్వం ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. పని భారంతో, ఆన్‌లైన్ వర్కులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. రాజకీయ జోక్యం రోజురోజుకీ పెరుగుతుందన్నారు. పనిచేయని ఫోన్లు ఇచ్చి ఆన్‌లైన్ వర్కులు చేయమంటే ఎలా? అని ప్రశ్నించారు. పని చేయకుంటే నోటీసులు ఇస్తామని, వేతనాల నిలిపేస్తామని, సొంత ఫోనులో వర్క్‌లు చేయాలని బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. కరోనా సమయంలోనూ ఆశా వర్కర్లు ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. అయినా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. సమావేశాల సమయంలో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించట్లేదన్నారు. టిఎలు కూడా ఇవ్వట్లేదన్నారు. గర్భిణులైనప్పటికీ మెడికల్ లీవ్‌లు ఇవ్వట్లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వ పథకాలను అందించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, మరణించిన ఆశావర్కర్ కుటుంబ సభ్యుల్లో అర్హులకు అవకాశం కల్పించాలని, నాణ్యమైన సెల్‌ఫోన్లు, 4జి సిమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆశాలకు పిలుపునిచ్చారు.

108 ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

108 ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. సంఘం జిల్లా మహాసభ శుక్రవారం పేపర్‌మిల్లు వద్ద గల సిఐటియు కార్యాలయంలో శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా బి.రాజులోవ, గౌరవ సలహాదారుగా ఎంఎన్.శ్రీనివాసు, అధ్యక్షులుగా ఇఎన్‌వి.రమణ, జనరల్ సెక్రటరీగా గుజ్జుల రమేష్‌బాబు, కోశాధికారిగా జె.వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జొన్నకూటి నానాజీ, ఉపాధ్యక్షులుగా లోహి నాగరాజు, వి.దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శిగా డి.ఆనంద్, ఐ.రమేష్‌నాయుడు, కమిటీ సభ్యులుగా జె.క్రాంతి, డి.సుధాకర్, మహిళా అధ్యక్షులుగా ఎన్.సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, 108ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఎంఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎన్నికల ముందు 108 ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వేతనాలు పెంచాలని, ప్రభుత్వ కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 108ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం ఇదే...

రోడ్లకు రూ.11 కోట్ల మంజూరు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు నియోజకవర్గంలో నాలుగు బిటి రోడ్లకు రూ.11 కోట్లు మంజూరయ్యాయని హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆమె ఈ వివరాలను మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనతో పాటూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.కొవ్వూరు నియోజకవర్గంలో మార్టేరు నుంచి ప్రక్కిలంక రోడ్డును ధర్మవరం, మలకపల్లి, పెద్దేవం, బల్లిపాడు, వేగేశ్వరపురం, తాళ్లపూడి మీదుగా 9.97 కిలోమీటర్ల మేర బిటి రోడ్డుగా మారుస్తామన్నారు. దీనికి రూ.4కోట్లు మంజూరయ్యాయన్నారు. ఊనగట్ల నుంచి బ్రాహ్మణగూడెం వరకు కలవలపల్లి మీదుగా 8.35 కిలోమీట్ల బిటి రోడ్డుకు రూ.2.8 కోట్లు, చాగల్లు నుంచి చిక్కాలపాలెం వరకూ 6.90 కిలోమీటర్ల బిటి రోడ్డుకు రూ.1.8 కోట్లు మంజూరయ్యాని తెలిపారు. అలాగే చిట్యాల నుంచి కుమారదేవం వరకు మొత్తం 11.60 కిలోమీటర్ల మేర బిటి రోడ్డు కోసం రూ.3 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ౹. ఈ నిర్మాణంలో తిరుగుడుమెట్ట, పెద్దేవం, రావూరుపాడు మీదుగా కుమారదేవం వరకూ 8.6 కిలోమీటర్ల మేర బిటి రోడ్డును నిర్మిస్తామన్నారు.

ట్రిపుల్ ఐటికి తాళ్లపూడి విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడిలోని శ్రీ పరస పద్మజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుళు కె.అనిల్‌కుమార్, ఎస్.తేజస్విని సీట్లు సాధించారని హెచ్ఎం సిహెచ్.సుబ్బలక్ష్మి తెలిపారు. పదవ తరగతిలో 573 మార్కులు సాధించిన అనిల్‌కుమార్‌కు నూజివీడులో, 561 మార్కులు సాధించిన ఎస్.తేజస్విని ఒంగోలు ట్రిపుల్‌ఐటిలో సీట్లు సాధించారని తెలిపారు. వీరిని పిఎంసి చైర్మన్ పి.బంగార్రాజు, హెచ్ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుల సమస్యలపై అధికారుల నిలదీత

తూతూ మంత్రంగా జడ్‌పి సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రైతుల సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. కాకినాడ జెడ్‌పి కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్‌పి సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్‌పి సమావేశం అని పెట్టి రైతుల సమస్యలపై శ్రద్ధ చూపడం లేదని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి జిల్లా అని చెప్పి కేవలం కాకినాడ జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే నివేదికలో పొందుపర్చారన్నారు. కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డుల లెక్కల వివరాలు కూడా సమగ్రంగా ఇవ్వలేదన్నారు. జూన్ 1నే కాలువలకు నీటిని విడుదల చేశామని అధికారులు చెబుతున్నా నేటికీ అనేక చోట్ల నారుమళ్లు కూడా సిద్ధం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. గతేడాది కూడా ఇదే మాట చెప్పినప్పటికీ సకాలంలో నీటి విడుదల లేకపోవడంతో అపరాల సాగు జరగలేదన్నారు. సమావేశాల్లో అధికారులు చెబుతున్న అంశాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదన్నారు. చిరుధాన్యాల సాగుపై మాటల్లో తప్ప ఆచరణలో శ్రద్ధ కనబర్చట్లేదన్నారు. ఎజెండాలో 31 అంశాలను పొందుపరచగా వ్యవసాయ, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య, గృహ నిర్మాణ సంస్థ, ఆర్ అండ్ బి, విద్యా, ఉపాది హామీ తదితర 8 అంశాలను మాత్రమే సమావేశంలో చర్చించి మమ అనిపించారు. పిఆర్ ఇంజినీరింగ్ శాఖపై మొక్కుబడిగా కానిచ్చారు. విద్యుత్ శాఖపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు అప్రకటిత కరెంటు కోతలపై ధ్వజమెత్తారు.



రైతుల సమస్యలపై నిలదీస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు

కౌలు రైతుల చట్టం ప్రకారం భూ యజమాని సంతకం ఉంటేనే సిసిఆర్ కార్డు జారీ చేస్తుండడం వల్ల వాస్తవ సాగుదారుడికి తీవ్ర నష్టం జరుగుతుందని, పలువురు రైతులు అప్పుల పాలవుతున్నారని సమావేశంలో కొందరు జెడ్‌పిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. తారతమ్యం లేకుండా పూర్తిస్థాయిలో అందరికీ సిసిఆర్ కార్డులు జారీ చేయాలని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు కోరారు. వాస్తవ సాగుదారుడికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో విఆర్వో, వ్యవసాయ శాఖ అధికారుల సంతకాలతో ఐదేళ్లు కౌలుకు సాగు చేస్తున్న రైతులకు డిసిసిబి ద్వారా రుణాలిచ్చే ప్రక్రియను కొత్తపేట నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు కొత్తపేట ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలువలకు నీరు విడుదల చేసినా శివారు ప్రాంతాలకు అందడం లేదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదైందన్నారు. ప్రస్తుతం వానలు కురుస్తున్నాయని ఈ నేపథ్యంలో గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మెట్ట ప్రాంతాల్లో రాగి వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కూడా సరఫరా చేశామన్నారు. 0 వేల వరకు భూసార పరీక్షల నమూనాలు తీసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా జెసి ఇలాక్కియా మాట్లాడుతూ జిల్లాలో కౌలురైతులకు గతేడాది 40 వేల కార్డులు అందించామని, ఈసారి ప్రతి ఒక్క కౌలు రైతుకు కార్డు అందించి, రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సీజనల్ వ్యాధులు, చర్యలపై చర్చజరిగింది. అనంతరం వాలంటీర్లపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వారికి పూర్తిభరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. వాలంటీర్లకు భరోసాగా తీర్మానం చేశారు. కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా, మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, జెడ్‌పి వైస్ చైర్మన్ అనుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో చంద్రయాన్-3 నమూనా రాకెట్ ప్రదర్శన

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుతూ శుక్రవారం పాఠశాలలో నమూనా రాకెట్‌ను ప్రదర్శించారు. పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు దీన్ని తయారు చేశారు. ఇస్రో నుండి రాకెట్ అంతరిక్షంలోకి వెళ్లే సమయంలో ఏ విధంగా ఉపయోగిస్తారో అదే విధంగా ఉపయోగించారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి కరస్పాండెంట్ వివి.అనిష్, ఉపాధ్యాయులు శ్రీహరి, రమణ తదితరులు పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగించిన విద్యార్థులను అభినందించారు.

బిఎల్‌ఒలకు శిక్షణ తరగతులు

తాళ్లపూడి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 31లోగా బూత్ లెవెల్ అధికారి ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్ గుర్తింపు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్, సహాయ ఎన్నికల అధికారి టి.రాధిక సూచించారు. దీనికి సంబంధించి మండలంలోని బిఎల్‌ఒలకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

వాతావరణ పరిస్థితుల బట్టి సాగు

కడియం : సాగులో వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు తగిన చర్యలు తీసుకోవాలని కడియం మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలం అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఎఒ కె.ద్వారకాదేవి అధ్యక్షతన శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకం కోసం ఆర్‌బికె వద్ద, లేదా మీసేవ సెంటర్‌లో పిఎం కిసాన్, ఇకెవైసి చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు కూడా 2023-24 సంవత్సరానికి సంబంధించి కౌలు కార్డులు చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌కి సంబంధించి అగ్రికల్చర్, హార్టికల్చర్ పంటలు పండించే రైతులు ఆర్‌బికెల్లో నమోదు చేయించుకోవాలన్నారు. అప్పుడే పంట నష్ట పరిహారాలు, ఇన్సూరెన్స్‌లు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ అధికారి డి.సుధీర్‌కుమార్, వెటర్నరీ ఎడి జెఎస్‌ఆర్ఆర్ఆర్.కుమార్, మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఎంపీ పరామర్శ

కడియం : ఉన్మాది దాడిలో గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఎంపీ మార్గాని భరత్‌రామ్ శుక్రవారం పరామర్శించారు. 'నేను ఉన్నాను' అంటూ ఆమెకు భరోసానిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వివాహితపై దాడికి పాల్పడ్డ వ్యక్తి తరచూ మద్యం మత్తులో ఉంటాడని, బ్లేడ్ బ్యాచ్‌తో సంబంధం ఉన్నట్లు చెబుతున్నారన్నారు. పోలీసులు వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారన్నారు. హత్యాయత్నానికి పాల్పడిన కారణంగా నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేశారన్నారు. ప్రజలు చైతన్యవంతులు కావాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన బుద్ధి చెప్పాలని ఎంపీ భరత్ పిలుపునిచ్చారు.

స్థాయి ఆధారిత బోధనతో ఉత్తమ ఫలితాలు

రాజమహేంద్రవరం : స్థాయి ఆధారిత బోధనతో ఉత్తమ ఫలితాలు రాబట్టొచ్చని పరిశీలకులు సిద్ధనాతి శ్రీనివాస్ అన్నారు. తరల్(టీచింగ్ ఎట్ రైట్ లెవెల్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రథమ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థులకు సంబంధించి తెలుగు, గణితం సబ్జెక్టులలో నిర్వహించే కార్యక్రమమని ఆయన అన్నారు. ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరల్ బేస్‌లైన్ పరీక్షను ఆయన శుక్రవారం పరిశీలించారు. 3,4,5 తరగతుల విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాన్ని గుర్తించి ఆ స్థాయిన బట్టి కృత్యాబోధన చేయడమే 'తరల్' లక్ష్యమన్నారు. తరల్ విషయ నిపుణులు, పరిశీలకులు వరహాగిరి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ విధానంలో విద్యార్థులు త్వరగా విషయావగాహన చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

భూములు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి- గోకవరం

ఐదు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న తమ భూములను సీలింగ్ పేరులో అధికారులు లాక్కున్నారని, తమ భూములు తమకు ఇప్పించాలని గుమ్మళ్లదొడ్డికి చెందన రైతులు కోరుతున్నారు. శుక్రవారం గోకవరం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో సుమారు 12 మంది రైతులు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటూ ఫల సాయం పొందుతున్న 7.64 ఎకరాల భూమిని 2015లో సీలింగ్ పేరుతో అధికారులు లాక్కున్నారన్నారు. కుమార్తెల వివాహాల సమయంలో ఈ భూమిని పసుపుకుంకుమ కింద ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఈ భూములు లేకపోవడంతో కుటుంబ కలహాలు తలెత్తుతున్నాయి అని వాపోయారు. తాము ఈ భూమిపైనే ఆధారపడి జీవించామని, వెంటనే తమకు అప్పగించాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత

ప్రజాశక్తి - గోపాలపురం

మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ సమతుల్యతను కాపాడొచ్చని, మొక్కల రక్షణ అందరిపైనా ఉందని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అన్నారు. మండలంలోని కరగపాడు గ్రామపంచాయతీ వద్ద ఓ భూ యజమాని ఇటీవల భారీ వృక్షానికి నిప్పు పెట్టినా క్రమంలో ఆ చెట్టు చనిపోయిన ప్రాంతంలో సర్పంచ్ బొమ్మిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అడవుల శాతం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ టి.వెంకట్రావు, బొమ్మిన నాగరాజు, దొడ్డిగర్ల రామారావు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అదానీ కేసు, వివేకానంద కేసుల సాగదీతలకన్నా.. మన సీరియల్స్ సాగుడు పెద్ద సాగదీతేం కాదొదినా..!!

కొత్తపల్లిలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంఓ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వ అరాచక పాలన ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలు విలవిల్లాడుతున్నారన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని త్వరలో ఇంటికి సాగనంపడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారికి న్యాయం చేసే విధంగా టిడిపి పనిచేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, నాయకులు ఆడపా భరత్‌బాబు, యు.రాము, సర్పంచ్ అడపా వెంకట్రావు, దిండి రాజు పాల్గొన్నారు.

36 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరు నాక్ భవనంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 36 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు మాట్లాడారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మినీ జాబ్ మేళాకు 78 మంది నిరుద్యోగులు హాజరయ్యారన్నారు. ముఖ్యఅతిథులుగా డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.హరీష్‌చంద్రప్రసాద్, నాక్ డైరెక్టర్ జున్నూరి రాజు, ప్లేసెమెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్‌కుమార్ హాజరయ్యారు.

కోట సత్తెమ్మకు చీర, సారె అందజేత

నిడదవోలు : నిడదవోలు కోటసత్తెమ్మకు అమ్మవారికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు, ఆయన సతీమణి సుమలత చీర, సారెను శుక్రవారం అందించారు. గణపతి సెంటర్ నుంచి మేళతాళాల మధ్య ర్యాలీగా వెళ్లి వీటిని అందించారు. అనంతరం కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రూ.1.90 కోట్లతో నిర్మించిన కోటసత్తెమ్మ సదన్ భవన సముదాయాన్ని ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, కౌన్సిలర్స్, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వంతెనకు నిధుల మంజూరుకు వినతి

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని కామరాజుపేటలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు కాలువపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని శుక్రవారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో కాకినాడ ఎంపీ వంగా గీత, జడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావుకు గోకవరం జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ, ఎంపిపి శ్రీవల్లి వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటికకు వెళ్లాలంటే కాలువదాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. వర్షాకాలంలో కాలువ దాటలేక అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- గోకవరం

అసైన్డ్ భూములను అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గోకవరం గ్రామం దేవీచౌక్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉన్న అసైన్డ్ భూములకు సర్వాధికారాలు కల్పించి దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలను రైతులుగా తీర్చిదిద్దిన జగన్‌కు దళితులంతా రుణపడి ఉంటారని తెలిపారు. ఎస్‌సిల శ్మశానాలకు స్థలాలను కేటాయించడానికి కూడా నిర్ణయం తీసుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. దళితుల పక్షపాతిగా ఉన్న జగన్‌ను ఎవరైనా ఏమైనా అంటే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి, ఉభయగోదావరి జిల్లాల ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, బుజ్జి రాజు, బి.మోహన్, బి.అబ్బులు, టి.రాంప్రసాద్, ఎం. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన బద్రి దివ్య రమ్య (20) శుక్రవారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ వివాదాల వల్ల రమ్య ఆత్మహత్య చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. పేరూరు గ్రామానికి చెందిన రమ్యకు రెండేళ్ల క్రితం నల్లమిల్లికి చెందిన బద్రి గంగరాజుతో వివాహం అయ్యింది. వీరికి ఇంతవరకు సంతానం కలగలేదు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ అందే పరదేశి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

చిత్రహింసలు తాళలేక భర్తను హత్య చేసిన భార్య

ప్రజాశక్తి-అయినవిల్లి

మద్యానికి బానిసై చిత్రహింసలు పెడుతున్న భర్తను భరించలేక కడతేర్చిన భార్య ఈ సంఘటన మండలంలోని ఆయనవిల్లిలంక గ్రామంలో చోటు చేసుకుంది ఇసుకపట్ల రామకష్ణ (36) మద్యానికి బానిసై రోజు తాగివచ్చి భార్యతో పాటు తల్లిదండ్రులతో గొడవ పడుతూ కొడుతుండేవాడు. రోజులాగే రాత్రి కూడా గొడవ పడటంతో విసిగిపోయిన భార్య భర్త తలపై చెంబుతో బలంగా మొదడంతో రక్తపు మడుగులో పడి చనిపోయాడు. సిఐ ప్రశాంత్ కుమార్, ఎస్ఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

నీలాద్రిరావుపేటలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసకుంది. అదే గ్రామానికి చెందిన మెట్టేటి చిట్టెమ్మ (75) రోడ్డు దాటుతుండగా రాజమండ్రి వైపు నుండి జగ్గంపేట వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వై.గణేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పెద్దాపురం తరలించినట్లు తెలిపారు

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రౌతులపూడి

రైతులపూడిలో శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. చాకిరేవుపాలెం గ్రామానికి చెందిన సతీష్, ప్రసాద్ యువకులు చెరో బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలు పాలైన యువకులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు.

ఆటోను బైకు ఢీకొని నలుగురికి..

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి హరిత కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆటోలను బైకు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బైకుపై వెళుతుండగా ఎదురుగా పశువులు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయి ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరు విద్యార్థులు, ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 ఆంబులెన్స్‌లో స్థానికులు, పోలీసులు వారిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం గ్రామం శివారులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పేకాట శిబిరంపై సమాచారం అందుకున్న ఎస్ఐ వై.గణేష్ కుమార్ సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పిఠాపురంలో 'ఇంటింటికీ వర్మ'

ప్రజాశక్తి-పిఠాపురం

టిడిపి ప్రభుత్వ హయాంలోనే పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని మరొక్కసారి తనకు ఎంఎల్ఏగా మరో అవకాశం ఇవ్వాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎంఎల్ఏ వర్మ ప్రజలు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో వర్మ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి శుక్రవారం మన ఇంటికి మన వర్మ కార్యక్రమం చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర కోటగుమ్మం సెంటర్, మార్కెట్ సెంటర్, చర్చి సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగింది.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడుగా ఎదగాలని ఇస్రో విశాంత్రి శాస్త్రవేత్త వై.శివప్రసాద్ అన్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరునిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో గొప్ప శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఉన్నత లక్షలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం గురించి వివరించారు. పాఠశాల హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, బలరామకృష్ణ, కేసరి శ్రీనివాసరావు, ఎంవిఎస్.రామకృష్ణ, జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీహరిరావు, బి.సంపత్ కుమార్, పి.ధనలక్ష్మి, జి.మేరీ విజయకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి -కరప

కరప గ్రామం రామకంచి రాజు నగర్ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ 148లో అంగన్వాడి సహాయకురాలు పోస్ట్‌కు ఖాళీ ఏర్పడిందని ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. ఎస్‌సి కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఈ దరఖాస్తులను కాకినాడ ఐసిడిఎస్‌లో ఈ నెల 17వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. గొర్రిపూడి, వేములవాడ, కూరాడ గ్రామాల్లో వాలంటీర్ పోస్టులు ఒక్కొక్కటి చెప్పున ఖాళీలు ఉన్నాయని ఆ గ్రామాలలో ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపిడిఒ తెలిపారు. ఈ పోస్టులను ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కరప మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరిస్తామని తెలిపారు.

యానాం వార్తలు


శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు, ఎంఎల్ఎ అశోక్

కో- ఆపరేటివ్ సిబ్బందికి ఎంఎల్ఎ సంఘీభావం

ప్రజాశక్తి -యానాం

నాలుగు రోజులుగా తమకు బకాయి వేతనాలు చెల్లించాలంటూ కో ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది చేపట్టిన నిరాహార దీక్షకు పలు పార్టీలు, సంఘాల నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక నెల జీతం రాకపోతేనే ఇబ్బందులు ఎదుర్కొనే ఈ రోజుల్లో 30 నెలల వేతనాలు అందించకపోవడం బాధాకరమన్నారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. లిక్కర్ స్టోర్స్‌లో రూ.లక్షల అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోపరేటివ్ ప్రెసిడెంట్ సిబ్బంది పట్ల కక్షతో వ్యవహరిస్తూ స్టోర్స్‌ను భ్రష్టు పట్టించారన్నారు. అనంతరం భాజపా నాయకులు కోపరేటివ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోరుతూ పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి మాట్లాడారు. ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కార్యకర్తలు దీక్ష శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం పండు సిద్దార్థ కుమార్ డివివి సత్యనారాయణ, హరిచంద్ర, లంకే లోవరాజు, సబ్బతి లోకేష్, ఎం.లోవరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు కనకాల రాజు, ఎన్ఆర్ కాంగ్రెస్ నాయకుడు శామ్యూల్, నక్కల సుబ్బన్న, కనకాల కృష్ణ, కామిశెట్టి కమలాకర్ నాయుడు, వేణుగోపాల్, చెక్కల అరుణ్ కుమార్, బి.నాగేశ్వరరావు, కనకాల నాని, శ్యామ్, ప్రిన్స్ కుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

శారదాదేవికి సారె అందజేత

ప్రజాశక్తి - యానాం

ఆషాడ మాసం సందర్భంగా స్థానిక గోపాల్ నగర్‌లో ఉన్న ఉన్న శారదా దేవి ఆలయంలో అమ్మవారికి మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పిండి వంటలు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మహిళలు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

బిసి బాలుర హాస్టల్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే బిసి బోయ్స్ హాస్టల్‌ను పున్ణ ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు యానాంలో ఉన్న 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు కోసం వెల్ఫేర్ ఆఫీసర్ చింతా రామజోగిని సంప్రదించాలన్నారు.

గోదావరి వరదలపై సమీక్ష

ప్రజాశక్తి - యానాం

గోదావరి వరదలపై సమీక్ష సమావేశాన్ని ఆర్ఎఒ మునిస్వామి అన్ని శాఖల అధికారులతో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్ఎఒ మునిస్వామి మాట్లాడుతూ వరదలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు లక్ష్య సాధనతో కృషి చేయాలని సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ చెప్పారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన ప్రాజెక్ట్ చేతన, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ డే కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడం విద్యార్థులకు ఎంతో గొప్ప సదవకాశమని సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు. విద్యార్థులు తొలుత తమ ఇష్టాన్ని, అభిరుచులను గుర్తుంచుకొని వాటి కనుగుణంగా లక్ష్యాన్ని ఏర్పరచు కావాలని, తద్వారా మంచి కెరీర్ ఎంచుకోవాలని తెలిపారు. ప్రయత్నం చేయడంలో అలసత్వం కూడదని, ఆత్మవిశ్వాసంతో అనుకున్న కెరీర్‌లో రాణించాలని పేర్కొన్నారు. సమాజంలో అనేక కెరీర్‌లు ఉన్నాయని, వేటికవే ప్రత్యేకత కలిగి ఉన్నాయన్నారు. స్కూల్ కెరీర్ గైడెన్స్ ఆఫీసర్ జి.గోవిందు కెరీర్‌డే ప్రాముఖ్యత వివరించారు. ప్రతి నెలలో రెండవ మరియు నాల్గవ శుక్రవారం ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విషయం తెలిపారు.విద్యార్థులకు నెలలో రెండుసార్లు స్టడీ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. తోటకూర సాయి రామకృష్ణ, టీచర్లు వి.రాజు, కె.అరుణ, కెవివిసత్యనారాయణ, కె.శ్రీనివాస్, డివిఆర్ఎస్.వల్లి, బి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వాలుతిమ్మాపురం రహదారిలో నిర్మించిన టిట్కో గృహాలు లబ్ధిదారులందరికీ వెంటనే అప్పగించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ టిట్కో గృహాలు నేటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. గృహాలు అప్పగించిన లబ్ధిదారుల్లో అధిక శాతం మంది టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఎంతో సంతోషంతో స్వంత గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఈ గృహాల్లో పూర్తిస్థాయిలో మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయలేదన్నారు. మంచినీటి వాల్వులను ఆపరేట్ చేసే సిబ్బంది కూడా లేరన్నారు. 1700 గృహాలు ఉన్న ఈ కాలనీలో మంచినీటి సదుపాయం ,వీధిలైట్లు కల్పించకుంటే ప్రజలు ఎలా జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, డి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు రైతుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పిఠాపురం

గోకివాడలో అక్కినీడి వారి చెరువు పుట్టకుంట కాలువపై తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటు చేయాలని రైతులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో గ్రామ రైతులు వాసిరెడ్డి చిట్టిబాబు, కర్రెడ్ల బాపన్నదొర, విశ్వనాథం సత్తిబాబు, నామా రమేష్, సిరికి సూరిబాబు ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ షట్టర్లు తొలగించడంతో తమ గ్రామంలో పంటలకు నీరందక పంట నష్టపోతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరగ సత్యానందం, నామా పెద్దిరాజు, నామా సూరిబాబు, కొత్తెం నానాజీ, గరగ శేషుబాబు, కొత్తెం బుజ్జి, కాయల పవన్ పాల్గొన్నారు.

'రవీంద్రభారతి'లో డివైఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండల కేంద్రమైన జగ్గంపేటలో ఉన్న రవీంద్ర భారతి పబ్లిక్ పాఠశాలలో డివిజనల్ విద్యాశాఖ అధికారిని సుభద్ర శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు ఎక్కడ ఆటంకం రాకుండా వేరే పాఠశాలలో చేర్పిస్తామని ఆమె పేర్కొన్నారు. శ్రీ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ మూసి వేస్తున్నారని, పిల్లల్ని స్కూల్ యాజమాన్యం రావద్దంటున్నారని, వేరే పాఠశాలలో ఎవరు జాయిన్ చేసుకోవడం లేదని, తమ పిల్లల భవిష్యత్ ఏమిటని అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆమె పాఠశాలను సందర్శించారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించే విధంగా ఎంఇఒకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ఆరు నుండి పదవ తరగతి వరకు కూడా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి టిసిలు ఇచ్చినట్టు తెలిపారు.

కుల, మతాలకతీతంగా సమన్యాయం

కాకినాడ రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో కుల మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తున్నట్టు మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎంఎల్ఏ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలో శుక్రవారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణల ద్వారా సుమారు రూ.23 లక్షల 20 వేల సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కరప జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, కరప ఎంపిపి శ్రీలక్ష్మీ సత్తిబాబు, సూర్యారావుపేట సర్పంచ్ సూరాడ చిన్నిరాజు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో విద్యనభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారులు సూచించారు. గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గహాన్ని ఎంఇఒ-1 కె.కిరణ్ బాబు,ఎంఇఒ-2 ఎస్.సత్య కష్ణ లు శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా వసతి గహంలోని విద్యార్థినిలకు అందిస్తున్న సదుపాయాలను వార్డెన్ బి.తులసిని వారు అడిగి తెలుసుకున్నారు. విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ వసతి గహంలో ఉన్న సదుపాయాలను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నతులుగా ఎదగాలని అన్నారు.

సాగు వివరాలను రైతులకు తెలియజేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గ్రామస్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయసహాయకులు రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామం పరిధిలోని రైతులకు,కౌలు రైతులకు సరైన సాగు పద్ధతుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ ఇళ్ల సూర్య నారాయణ అన్నారు. కె.గంగవరంలో వ్యవసాయ మండల సమావేశం శుక్రవారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఎడిఎ ఎవిఎస్.రంగారావు మాట్లాడుతూ ప్రస్తుత తొలకరి పంటలో భాగంగా అందరూ కూడా ఈనెల జూలై 15 లోపు నారుమడులు వేసుకోవాలని నారుమడులు వేయని వారు జూలై 15 తర్వాత నుంచి నేరుగా వెదజల్లే పద్ధతిలో మాత్రమే పంట వేసుకోవాలన్నారు. ఆగస్టు 15 లోపు వరి నాట్లు కూడా పూర్తి చేయాలని దానికి అనుగుణంగా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంపిపి నాగమణి మాట్లాడుతూ వరి వ్యవసాయంతో పాటు ప్రభుత్వం ఉచితంగా అందించే కందులను వరి గట్ల చుట్టూ పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందే దిశగా కూడా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందులు కావలసినవారు స్థానిక రైతు భరోసా కేంద్రాల వారిని సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బలుసు రవి మాట్లాడుతూ చిరుధాన్యాల పెంపకం ద్వారా అదనపు ఆదాయం మరియు తద్వారా వాటిని ఉపయోగించుకోవడం వల్ల మంచి ఆరోగ్యం రెండు కలుగుతాయని వివరించారు కార్యక్రమంలోఅన్ని గ్రామాల ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 22 ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రయివేట్ కళాశాలల అసోసియేషన్ పిలుపుతో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విజయవంతమైంది. ఎకెఎన్‌యు కాలేజీస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నరసింహ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 22 రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో చాలా కళాశాలలను అనేక కారణాలు చూపించి మూసివేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ప్రభుత్వానికి చెల్లించే ఫీజులు పెంచుతూ, కళాశాలకు చెల్లించే ఫీజులు తగ్గిస్తూ రావటాన్నీ తపప్పుబట్టారు. కార్యక్రమంలో యాలంగి వరప్రసాద్, కరాటం ప్రవీణ్, సూర్యకుమారి, కె.మనోహర్, బి.శ్రీనివాస్, జాన్‌పాల్, నాగరాజు, కె.వెంకటేష్, సంసొన్ తదితరులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

బడి బయట పిల్లలు పాఠశాల్లో చేరిక

ప్రజాశక్తి-మండపేట

స్థానిక వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బడి బయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.షాలెంరాజు ఆధ్వర్యంలో పాఠశాల్లో శుక్రవారం చేర్పించారు. ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలని ప్రభుత్వం పేద విద్యార్థుల కొరకు పథకాలు అమలు చేస్తున్నందున అందరూ వాటిని వినియోగించుకుని చదువుకుని విద్యావంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా బడి బయట పిల్లలు రాసూరి మేరి, రాసూరి గోగులమ్మలను తిరిగి పాఠశాల్లో చేర్పించారు. బడి బయట పిల్లలను గుర్తించి అటువంటివారిని విద్యా హక్కు చట్టం ద్వారా పాఠశాల్లో అడ్మిషన్లు ఇవ్వాలని సూచించారు. హెచ్ఎం ఆర్.నాగకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సుధాకర్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల టిడిపి గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి సుధాకర్ పుట్టినరోజు వేడుకను శుక్రవారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. సుధాకర్‌ను పూలదండలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి నాయకులు యడ్లపల్లి తుక్కియ్య, పెట్టా కృష్ణ,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మామిడికుదురు

పగటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ లో ఉన్న చెట్లు కొమ్మలు తొలగింపు, మైనర్ రిపేర్ల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. మగటపల్లి, మామిడికుదురు, ఈదరాడ, కొమరాడ, లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని అధికారులు తెలిపారు.


పాలాభిషేకం చేస్తున్న జనసేన నాయకులు

కిర్లంపూడిలో పవన్‌కు పాలాభిషేకం

కిర్లంపూడి : కిర్లంపూడిలో జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ ఫోటోకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఉలిసి అయిరాజు మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఏమన్నారో పూర్తిగా చూడాలని, ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుదిరెడ్డి శ్రీనివాస్, దేగల విజయ్, సత్యంశెట్టి వీర గణేష్, ఎంపిటిసి గోకేడ రాజ, ఎలుబండి శివ, పాలిశెట్టి సతీష్ ఉన్నారు.